# స్వచ్ఛంద సంస్థల చొరవ అభినందనీయం

- ఎంపీ వినోద్‌కుమార్
- 'స్వచ్ఛ్ కరీంనగర్' కోసం 'చోళ మండల' విరాళం
- బాలవికాస సంస్థకు అందజేత




బాలవికాస ప్రతినిధులకు చెక్కు అందిస్తున్న ఎంపీ వినోద్‌కుమార్

**ముకరంపుర:** 'స్వచ్ఛ్ కరీంనగర్' అభివృద్ధి కోసం స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని కరీంనగర్ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా జిల్లాలోని పలు గ్రామాలను దత్తత తీసుకున్న 'చోళమండల్ ఇన్వెస్ట్ మెంట్, ఫైనాన్స్ కంపెనీ వాటి అభివృద్ధి కోసం రూ.97.3లక్షల విరాళాన్ని ప్రకటించింది. ఈమేరకు కరీంనగర్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆ చెక్కును ఎంపీ వినోద్‌కుమార్ చేతులమీదుగా బాలవికాస సంస్థకు అందజేశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ రాష్ట్రంలో వివిధ రకాల సేవలను అందిస్తున్న బాలవికాసతో కలిసి 'చోలమండల' సంస్థ 'స్వచ్ఛ కరీంనగర్' పథకాన్ని చేపట్టడం అభినందనీయమన్నారు. ఇది తప్పక విజయవంతమవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ పథకానికి ప్రభుత్వపరంగా సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. బాలవికాస ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ సింగారెడ్డి శౌరిరెడ్డి, చోళమండలం హెడ్ అగ్రి రూరల్ బిజినెస్ కన్నన్ మాట్లాడుతూ బస్‌స్టేషన్‌లో రెండు రూపాయలకే స్వచ్ఛమైన చల్లని నీరు అందిస్తామని చెప్పారు. ఆటోమెటిక్ టాయిలెట్‌ను అందుబాటులోకి తెస్తున్నట్లు సంస్థ సభ్యులు వివరించారు. ఈ రెండెంటినీ నిర్వహణ బాధ్యతలను అర్హులైన వికలాంగులకు ఇవ్వాలని యోచిస్తున్నట్లు పేర్కొన్నారు. బాలవికాస ప్రయోగాత్మకంగా చేపడుతున్న ఈ-టాయిలెట్ తెలంగాణ రాష్ట్రంలోనే మొదటిదని వారు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి, ఆరోగ్యాన్ని అందించాలనే లక్ష్యంతో బెజ్జంకి క్రాస్ రోడ్, గుగ్గిళ్ల, వింజపల్లి గ్రా మాల్లో మరుగుదొడ్లు లేని సుమారు 250కుటుంబాల కోసం మెరుగైన టాయిలెట్లు ఏర్పాటుచేస్తామని తెలిపారు. అలాగే ఎంపిక చేసిన గ్రామాల్లో వంద శాతం పూర్తిచేస్తామని చెప్పారు. జూలైలోగా కోహెడ పాఠశాలలో బోరుమోటార్, టాయిలెట్, బెజ్జంకి పరిధిలోని పాపన్నపల్లి ఆర్‌ఓ ప్లాంట్ పనులను పూర్తిచేస్తామని వారు వివరించారు. కార్యక్రమంలో జడ్పీ అధ్యక్షురాలు తుల ఉమ, బెజ్జంకి జడ్పీ సభ్యుడు తన్నీరు శరత్‌రావు, ఓరుగంటి ఆనంద్, చోళమండల ప్రతినిధులు కన్నాన్, మహ్మద్ ముహాయి, కన్సల్టెంట్ పామర్తి హేమంత్‌కుమార్, బాలవికాస్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ సింగారెడ్డి, ప్రోగ్రాం మేనేజర్ లత, మంజుల, ఎంపిక చేసిన గ్రామాల సర్పంచులు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, బాల వికాస్ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.